VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 11 ఆగస్టు 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 37

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



**బంగారం దిగుమతులపై సుంకాల పెంపు నిర్ణయం**

**మూడు నెలల్లోనే రూ.10,463 కోట్ల కస్టమ్స్ ఆదాయం**



## మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

**కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు**

న్యూఢిల్లీ, ఆగస్టు 10 : దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన

-మిగతా 2 లో..

# 74 లక్షల ఓట్లు ఔట్?

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

**రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు**

**73 లక్షల 95 వేల 954 ఓట్లు తొలగించినట్లు సమాచారం**

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సర్వేతో రాష్ట్రంలో 73.52 లక్షల ఓటర్ల (21.5 శాతం)కు సంబంధించిన ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ జరగకపోవడంతో ఈ ఓట్లన్నీ తొలగిపోనున్నాయి. ఓట్లు తేడాలున్న (అనామలీస్) జాబితాలో మరో 61 లక్షల మంది ఓటర్లున్నారు. వీటిలో కూడా ఎక్కువ శాతం ఓట్లు తొలగిపోయే అవకాశం ఉంది. మరోపక్క సర్‌లో 2002కు సబంధించిన వివరాలు నమోదుచేయని ఓట్లు కూడా ఉన్నాయి. ఈ ఓటర్లకు ఆగస్టు17 తర్వాత నోటీసులొస్తాయి. వీరు ఎన్నికల కమిషన్ గుర్తించిన గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి తమ ఓటును కాపాడుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా కోటికిపైగా ఓట్లను తొలగించే అవకాశం ఉందని సమాచారం.



హైదరాబాద్, ఆగస్టు 10 : తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటి వరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా

-మిగతా 2 లో..



## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

**రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి**

**మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ**

హైదరాబాద్, ఆగస్టు 10 : తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక

-మిగతా 2 లో..

## రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి

**సాగర్ తీరంలో మహా వరుణయాగం**

**హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, మంత్రులు**

**విజయవిహార్‌లో శాస్త్రోక్తంగా నిర్వహణ**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో క్రతువులు నిర్వహించారు. కృష్ణమ్మకు సీఎం పూర్ణాహుతి సమర్పించారు. 'రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. ప్రాజెక్టులు, చెరువులు నిండాలి..'అని ప్రార్థించారు.

నల్గొండ, ఆగస్టు10 : 'ఓం వరుణదేవాయ నమః' అంటూ 108 మంది రుత్వికులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య 11 హోమ గుండాలతో నాగార్జునసాగర్‌లోని విజయపురిలో మహా వరుణయాగం శాస్త్రోక్తంగా జరిగింది. యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయ పండితుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 4.05 గంటలకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా ఈ క్రతువు ప్రారంభమైంది. మధ్యాహ్నం 3.24 నిమిషాలకు యాగంలో తుది అంకమైన పూర్ణాహుతి కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీత హాజరయ్యారు. రుత్వికులు, గోపూజతో ప్రారంభించి యాగ ప్రదక్షిణం, పుణ్యాహవాచనం, అంకురార్పణ, రుష్యశృంగ పూజలతో వరుణ యాగం సాగించి.. వర్షాలు సమృద్ధిగా కురవాలని

-మిగతా 2 లో..



## గ్లోబల్ హబ్‌గా తెలంగాణలో ఇంధన రంగం అభివృద్ధి

**2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం**

**అమెరికా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి**

హైదరాబాద్, ఆగస్టు 10 : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్'ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా

-మిగతా 2 లో..





## మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

**నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు విమర్శలు**

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది


**నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం**

**సంతాపసభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

నర్సంపేట, ఆగస్టు 10 : ఎంత కాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

-మిగతా 2 లో..





**వైభవంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు**

## అన్ని కులాలకు సమాన అవకాశాలు

**రాజకీయాలకతీతంగా పని చేయాల్సిన అవసరం ఉంది**

**సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్**



హైదరాబాద్, ఆగస్టు 10 : తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే

-మిగతా 2 లో..



## కొంపముంచిన రైతు అతి జాగ్రత్త

**పొలంలో దాచిన నోట్లకట్టలకు చెద**

**పనికిరాకుండా పోయిన 5లక్షల నగదు**

జైపూర్, ఆగస్టు 10 : రాజస్థాన్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఇంట్లో వాళ్లకు తెలియకుండా డబ్బును దాచే ప్రయత్నంలో ఓ రైతు భారీ నష్టాన్ని మూటగట్టుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసమని దాచిన సొమ్ము మట్టిపాలు కావడంతో ఏం చేయాలో పాలుపోని

-మిగతా 2 లో..

## కొత్త పింఛన్ల దరఖాస్తులు షురూ

**ఆఫీసర్ల లాగిన్ల ద్వారా 2 వేల దాకా అప్లికేషన్ల సమర్పణ**

**ఈ నెల 31 వరకు దాఖలు... ఆ తర్వాత వాటి పరిశీలన**



హైదరాబాద్, ఆగస్టు 10 : కొత్త చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. గత శుక్రవారం రాత్రి నుంచే జిల్లాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు తమ లాగిన్‌ల ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించినట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. ఇప్పటి వరకు ఆఫీసర్ల లాగిన్ల ద్వారా 2 వేల దాకా అప్లికేషన్లు దాఖలైనట్టుగా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం రెండున్నర లక్షల కొత్త చేయూత పింఛన్లు మంజూరు చేయాలని

-మిగతా 2 లో..



# 74 లక్షల ఓట్లు ఔట్?

(మొదటిపేజీ తరువాయి)

యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

# మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

- నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్ట్ 10 :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసార్ హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు మజ్లీస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. కోర్ట్‌ను తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గుల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారని.. ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదని నిలదీశారు. పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు. నల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చూస్తూ ఊరుకోం. క్యూర్‌పై ఆగస్ట్ 15 తర్వాత భాజపా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తాం. ఆ తర్వాత ఉద్యమాలు ఉధృతం చేస్తాం. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని రెండేళ్ల తర్వాత తప్పకుండా మారుస్తారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటున్నాం. ఇథనాల్‌తో వాహనాల ఇంజిన్‌లు పాడైపోతాయని ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుణయాగం చేస్తే.. తాము రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోవాలని వాయు యాగం చేస్తామన్నారు. వానాకాలం అంతా అయిపోయాక రేవంత్ రెడ్డిది ఇదో కొత్త నాటకమంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ఉన్న విషయం సీఎంకు తెలియదా అని రాంచందర్ రావు ప్రశ్నించారు.

# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

(మొదటిపేజీ తరువాయి)

సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోదీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి కాకతీయ కాలువ-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రార్థించారు. విజయవిహార్‌లోని కృష్ణమ్మ ఒడ్డున వేద పండితుల సమక్షంలో చతుర్వేద పారాయణ సహితంగా ఈ మహా క్రతువును నిర్వహించారు. హోమగుండాల్లో పవిత్ర అగ్నిని ప్రజ్వలింపజేసి వరుణ దేవుడిని ఆవాహన చేస్తూ హోమాలు చేశారు. ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం ఉందని వేదపండితులు పేర్కొన్నారు. నేటి నాగార్జునసాగర్ ప్రాంతం ఇక్ష్వాకుల రాజధాని విజయపురిగా ప్రసిద్ధి చెందిందని, ఈ ప్రాంతంలో ఆనాడే వరుణారాధన జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయని చెప్పారు. యాగం ముగిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సతీసమేతంగా.. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నాగార్జునసాగర్ జలాశయాన్ని సందర్శించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహాలు, జలాశయంలో నీటి నిల్వలపై ఆరా తీశారు. ప్రస్తుత నీటి నిల్వలు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతాయని మంత్రి ఉత్తమ్ సీఎంతో ప్రస్తావించారు. అనంతరం సీఎం దంపతులు.. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఫొటోలు దిగారు. అంతకుముందు సీఎం





రేవంత్‌రెడ్డి సతీసమేతంగా హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌లోని బీసీ గురుకుల విద్యాలయ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి మంత్రులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. అనంతరం సీఎం దంపతులను దేవాదాయశాఖ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, యాదగిరిగుట్ట ఈవో భవానీశంకర్‌లు యాగస్థలికి తీసుకువచ్చారు. రుత్వికులు సీఎం దంపతులతో పాటు మంత్రులను ప్రధాన వరుణ మండపం మధ్యభాగంలో కూర్చోబెట్టి పూర్ణాహుతి కార్యక్రమాలను పూర్తి చేశారు. తెలంగాణ నేలపై సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలతో రాష్ట్రం సస్యశ్యామలం కావాలని, అన్నదాతల మోమల్లో సంతోషం వెల్లివిరియాలని, కృష్ణా-గోదావరి నదులు జలకళతో పరవళ్లు తొక్కాలనే శుభ సంకల్పంతో ఈ మహా వరుణయాగం నిర్వహించామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, బాలూనాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అమిత్‌రెడ్డి, మేయర్ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అన్ని కులాలకు సమాన అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)

చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించా మని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

(మొదటిపేజీ తరువాయి)

సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంత కాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

# కొంపముంచిన రైతు అతి జాగ్రత్త

(మొదటిపేజీ తరువాయి)

స్థితిలో కూరుకుపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, పచ్‌పాద్రాకు చెందిన రైతు మంగీలాల్ మేఘ్వాల్ ఏడాది క్రితం కొంత జాగాను విక్రయించగా రూ.5 లక్షలు వచ్చాయి. ఈ డబ్బుతో చిన్న ఇంటిని నిర్మించుకోవాలని మేఘ్వాల్ భావించాడు. అయితే, ఇంత నగదును ఇంట్లో పెడితే ఎవరైనా చోరీ చేసే ప్రమాదం ఉందని భయపడ్డాడు. ఇంట్లో వాళ్లు చేసే వృథా ఖర్చులతో డబ్బు తరిగిపోయే ప్రమాదం ఉందని కూడా అనుకున్నాడు. డబ్బును ఎలా జాగ్రత్త చేయాలా? అని తెగ ఆలోచించిన అతడికి పొలంలో డబ్బును పాతిపెడితే ఎలాంటి ఇబ్బందీ ఉండదని అనిపించింది. దీంతో, ఓ రోజు రాత్రి అతడు కుటుంబసభ్యులకు తెలియకుండా పొలానికి వెళ్లాడు. రూ.5 లక్షలను పాలిథీన్ బ్యాగ్‌లో చుట్టి పొలంలో పాతిపెట్టాడు. ఆ తరువాత కొంతకాలానికి మళ్లీ డబ్బు అవసరం పడింది. కానీ ఆ డబ్బును పాతిపెట్టిన చోటును రైతు మర్చిపోవడంతో చిక్కులు ఎదురయ్యాయి. ఎంత ఆలోచించినా ఆ ప్రదేశం ఏదో గుర్తుకురాలేదు. పొలంలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పగా వారు పొలంలో వెతికి చివరకు నిరాశగా వెనుదిరిగారు. ఇటీవల వర్షాలు పడటంతో ఆ కుటుంబం వ్యవసాయానికి సిద్ధమైంది.

ఈ క్రమంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతుండగా డబ్బు కట్టలున్న బ్యాగు బయటపడింది. అయితే, నోట్లకు చెదలు పట్టి చాలా వరకూ పాడైపోవడంతో వారంతా హతాశులయ్యారు. చివరి ప్రయత్నంగా పాత నోట్లను బ్యాంకులో ఇచ్చి కొత్త నోట్లను తెచ్చుకోవాలని ప్రయత్నించారు. అయితే, నోట్లు బాగా పాడైపోవడంతో పచ్‌పాద్రా, బలోత్రాలోని బ్యాంకులు తిరస్కరించాయి. జైపూర్‌లోని బ్యాంకులను సంప్రదించాలని సూచించాయి. డబ్బులో కొంతమొత్తమైనా తిరిగొస్తే బాగుండని రైతు మంగీలాల్ ఆశిస్తున్నాడు. పొలంలో డబ్బు పాతిపెట్టకుండా ఉంటే బాగుండేదని పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు.




# గ్లోబల్ హబ్‌గా తెలంగాణలో ఇంధన రంగం అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# కొత్త పింఛన్ల దరఖాస్తులు షురూ

(మొదటిపేజీ తరువాయి)

సూత్రప్రాయంగా నిర్ణయించినా...ఇది దశల వారీగానే ఇవ్వడం సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందులో తొలివిడతగా 50 వేల పింఛన్లు ఇచ్చే అవకాశాలున్నట్టుగా తెలుస్తోంది. ఈ నెలాఖరు దాకా దరఖాస్తుల సమర్పణకు అవకాశమున్నట్టు తెలుస్తోంది. మళ్లీ వాటి పరిశీలన ప్రక్రియ పూర్తికి రెండు వారాలు పట్టే అవకాశముంది. ఈ అప్లికేషన్ల వెరిఫికేషన్ పూర్తయ్యాక జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వీటి ఆమోదానికి వారం,



పదిరోజులు కలిపి మొత్తం నెలన్నర రోజులు పట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యాక అక్టోబర్ 1 నుంచే దశల వారీగానే కొత్త పింఛన్ల పంపిణీకి అవకాశమున్నట్టుగా తెలుస్తోంది.

# భూభారతితో రైతులకు భరోసా

- ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు
- ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ?
- గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- హుస్నాబాబ్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం



**హనుమకొండ,ఆగస్ట్10 :** రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన మరియు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని మంత్రులు కలిసి ప్రారంభించడం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సహచర మంత్రులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

### పొంగులేటి, పాడి కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే పథకాలు ఆలస్యమవుతున్నాయని పొంగులేటి వ్యాఖ్యానించగా.. కౌశిక్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ దిగజారిందని పొంగులేటి అనడంతో కౌశిక్‌రెడ్డి మరోసారి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఇరు పార్టీల కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. దీంతో కాసేపు సభా ప్రాంగణం రసాభాసగా మారింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.





## రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

**ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్, ఆగస్ట్ 10 :** భారత ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'రిఫార్మ్ ఉత్సవ్ కార్యక్రమం అమలు, కార్యాచరణపై రాష్ట్రాలకు వివరించారు. అక్టోబర్ 2026 నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్ 2026లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. రెండో దశ అక్టోబర్-డిసెంబర్ 2026లో రిఫార్మ్ ఉత్సవ్గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ్ జన్ సమాధాన్ కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. మూడో దశగా డిసెంబర్ 28, 2026 నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యలు మరియు సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, స్టీఫెన్ రవీంద్ర, బి. పాపిరెడ్డి, లా సెక్రటరీ, అనుదీప్ దురిశెట్టి, అహ్మద్ నదీమ్, మహేష్ దత్ ఎక్కా, గౌరవ్ ఉప్పల్, స్వాతి లక్రా, దేవసేన, దివ్య దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉత్తరాఖండ్‌లో భారీ వర్ష బీభత్సం

**చమోలీలో కొట్టుకు పోయిన వంతెన**

**డెహ్రాడూన్,ఆగస్ట్10 :** ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చమోలీ జిల్లాలోని నీతి వ్యాలీ ప్రాంతాన్ని సోమవారం వరదనీరు ముంచెత్తింది. వరద ధాటికి ఓ వంతెన క్షణాల్లో కొట్టుకుపోగా.. పలువురు ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. భారీ వర్షాల కారణంగా నీతి వ్యాలీ ప్రాంతంలో ఉన్న నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. లోతట్టు ప్రాంతాల వైపు ఆ వరదనీరు దూసుకొచ్చింది. నీటితో పాటు మట్టి, బురద, పెద్దపెద్ద బండరాళ్లు కొట్టుకువచ్చాయి. ఈ క్రమంలో వరద ప్రవాహం బలంగా ఢీకొట్టడంతో ఓ ఇనుప వంతెన కొట్టుకుపోయింది. వంతెనకు ఓ వైపున ఉన్న పలు వాహనాలు కొట్టుకుపోగా.. మరోవైపు ఉన్న ఓ ట్రక్కు, ఎస్‌యూవీ వాహనాదారులు అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ప్రకృతి వైపరీత్యాన్ని అక్కడే ఉన్న కొంత మంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారాయి. కాగా, వంతెన కొట్టుకుపోవడంతో నీతి వ్యాలీ ప్రాంతానికి ప్రధాన పట్టణంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉత్తరాఖండ్‌లో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ, పునరావాస శాఖ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. డెహ్రాడూన్, బాగేశ్వర్, నైనిటాల్, చంపావత్ జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో రహదారులు దెబ్బతినడం, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

## పోలవరం తొలిదశ నిర్మాణానికి కేంద్రం ఆమోదం

**సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 :** పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. తొలి దశలో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపింది. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,620.53 కోట్ల నిధులు విడుదల చేసిందని పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.5,512.40 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ సందర్భంగా స్పిల్‌వే నిర్మాణంలో ఇప్పటివరకు 96.87 శాతం మట్టి పనులు పూర్తయ్యాయని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. కాంక్రీట్ పనులు 98.84 శాతం, స్టీల్ పనులు 92.9 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించింది. అలాగే ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్‌కు సంబంధించి కాంక్రీట్ పనులు 81.99 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. ప్రధాన కాలువల తవ్వకం పనులు 98.96 శాతం పూర్తయ్యాయని వివరించింది. ప్రాజెక్టు తొలి దశలో మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. పోలవరం తొలి దశలో నిర్వాసిత కుటుంబాల పునరావాసం, పునరావాస ప్యాకేజీల అమలుపైనా కేంద్రం వివరాలు వెల్లడించింది. ఇప్పటివరకు 17,892 నిర్వాసిత కుటుంబాలను తరలించినట్లు తెలిపింది. ఆర్అండ్ఆర్ పరిహారం కింద రూ.1,373.01 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం పేర్కొంది. పునరావాసం, పునరావాస పనులకు అదనంగా రూ.1,581.08 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు తొలి దశను మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం తెలిపింది. అవసరమైతే మరో ఏడాది గడువు పొడిగించే వెసులుబాటు కూడా ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితుల పునరావాసం, పునరావాస పనులను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని రాజ్యసభకు ఇచ్చిన సమాధానంలో కేంద్ర జలశక్తి శాఖ పేర్కొంది.

## హాస్టల్‌లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

**విద్యార్థి పరిస్థితి విషమం**

**మేడ్చల్,ఆగస్ట్10 :** మేడ్చల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌లో దారుణం ఘటన వెలుగులోకి వచ్చింది. పదోతరగతి విద్యార్థిపై సహచర విద్యార్థులు దాడికి పాల్పడారు. కామారెడ్డికి చెందిన విద్యార్థి అభిషేక్ రెడ్డిపై 8 నుంచి 10 మంది దాడి చేసినట్లు సమాచారం. కర్రలు, భోజనం ప్లేట్లతో కొట్టి.. బూట్లతో అభిషేక్ రెడ్డి ముఖంపై విద్యార్థులు తొక్కినట్లు తెలుస్తోంది. ఈ దాడి ధాటికి మెట్లపై నుంచి బాధితుడు కింద పడిపోయాడు. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం సమాచారం అందజేశారు. అభిషేక్ రెడ్డిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



## స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం

**సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జగ్గారెడ్డి**

**సంగారెడ్డి,ఆగస్ట్10 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గొప్ప ముందడుగని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయారని, ఇప్పుడు కొత్త కార్డులు ఇవ్వడంతో పాటు, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి

### ప్రియాంక హంతకులను కఠినంగా శిక్షించాలి : మంత్రి వాకిటి

**హైదరాబాద్,ఆగస్ట్10 :** వైద్య విద్యార్థిని ప్రియాంక మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో ప్రియాంక భౌతికకాయానికి మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రియాంక ఘటన అత్యంత దురదృష్టకరమని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి తమకు, అధికారులకు ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమని చెప్పుకొచ్చారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని నిందితులు తప్పించుకోకుండా కఠినతరం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## నగరంలో వాహనాల వీరంగం

**రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం**




**హైదరాబాద్,ఆగస్ట్10 :** హైదరాబాద్ నగరంలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఓ మిలిటరీ జవాన్‌తో పాటు మరొకరు మృతి చెందారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన థార్ వాహనం.. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వనపర్తి జిల్లాకు చెందిన చెల్లా శ్రీనివాసులు (50) గా గుర్తించారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందగానే ఘటనాస్థలికి మాదాపూర్ పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదర్ షాకోట్ ప్రాంతంలో వేగంగా దూసుకొచ్చిన మహీంద్రా థార్ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం ప్రకారం.. మహీంద్రా థార్ కారు రాంగ్ రూట్‌లో అత్యంత వేగంగా వచ్చి ముందుగా ఓ ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టింది. అనంతరం అక్కడి నుంచి ఆగకుండా వెళ్లిపోయిన కారు మరికొందరిని కూడా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన కారులో ఐదుగురు యువకులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. వారు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అతివేగంతో పాటు రాంగ్ రూట్‌లో అడ్డగోలుగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన కారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతానికి చెందిన బాబు గౌడ్ కి చెందినదిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే నార్సింగ్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. కారు డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న యువకుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. జవాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

## పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం

**రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 :** కేంద్రంలోని మోడీ సర్కార్ తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని.. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతరాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి.

**త్రివర్ణ పతాకాల పంపిణీ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని బస్ స్టాండ్ వద్ద త్రివర్ణ పతకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతి సంవత్సరం "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కేవలం స్వాతంత్ర దినోత్సవం ఒక్కరోజు జెండా ఎగురవేయడమే కాకుండా ఇంటిపై నిత్యం రెపరెపలాడాలన్నారు.

అలాగే ఈ నెల 14న జరిగే తిరంగా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్కర్ లక్ష్మీ నారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.





వేగుచుక్క



## వామిక గబ్బి.. హీరోలను డామినేట్ చేసే పెర్ఫార్మెన్స్

విలక్షణ దర్శకుడిగా తన మార్క్ టేకింగ్ తో అందరి దృష్టిని ఆకట్టుకున్న ప్రముఖ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ హీరోగా మారి ఇటీవల నటించిన తొలి చిత్రం డీసీ. ఆగస్టు 7వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఇందులో చంద్ర అనే పాత్రలో నటించింది బాలీవుడ్ బ్యూటీ వామిక గబ్బి. అయితే తాజాగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాగా సినిమాలో ఈమె నటనను చూసి ప్రేక్షకులు ఈమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈమె క్యారెక్టర్, నటన సినిమాకే హైలెట్ అని , కొన్ని చోట్ల లోకేష్ ను డామినేట్ చేసి నటించింది అంటూ తెగ పొగిడేస్తున్నారు.

## కెరీర్‌పై కామెంట్స్.. కీర్తి సురేష్ బోల్డ్ రిప్లై

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'లో కీర్తి సురేష్ ఒక ప్రత్యేక డ్యాన్స్ నంబర్ చేస్తోందని, మంచి ఆఫర్లు లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకుందంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ వచ్చాయి. అయితే, ఈ వార్తలపై సీరియస్ అవ్వకుండా కీర్తి సురేష్ చాలా చాకచక్యంగా, హ్యూమరస్ స్టైల్‌లో తమిళంలో ఇచ్చిన కౌంటర్ రిప్లై ఇచ్చింది. 'వేరే లెవల్ పొంగ! చిన్న కరెక్షన్.. నాని నటిస్తున్నది తెలుగు సినిమా, కన్నడ కాదు' అని తమిళంలో కామెంట్ పెట్టింది. ఇక ఆమె ఇచ్చిన ఈ సెటైరికల్ కౌంటర్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోయి, నవ్వుల ఎమోజీలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.



## కియారాకు యష్ సపోర్ట్

కియారా కష్టపడే తత్వాన్ని యష్ ఆకాశానికి ఎత్తేశాడు. ప్రసంగం మధ్యలో యష్ కియారా పేరు ఎత్తగానే.. ఆడియన్స్ నుంచి ఒక అభిమాని ఆమె నటించిన పాపులర్ పాటను గుర్తుచేస్తూ తబాహి అని గట్టిగా అరిచాడు. దానికి యష్ నవ్వుతూ నిజంగానే తబాహి! అని స్పందించడంతో ఆడిటోరియం అంతా నవ్వులతో నిండిపోయింది. ఆ తర్వాత యష్ మాట్లాడుతూ.. ట్రైలర్‌లో ప్రజలు చూసింది కియారా పాత్ర ఒక చిన్న మెరుపు మాత్రమే. ఈ సినిమా కోసం ఈ నటి చూపించిన అంకితభావం.. పడ్డ కష్టం అసాధారణమైనవి అని కొనియాడారు. సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుండి కియారా పాత్రపై నెటిజన్లు గుప్పిస్తున్న విమర్శల గురించి యష్ నేరుగా ప్రస్తావించారు. ఒక నటిగా నువ్వు కొన్ని అనవసరమైన విమర్శలను ఎదుర్కోవాల్సి రావడం దురదృష్టకరం. కానీ ఆ నెగెటివిటీని నువ్వు అసలు పట్టించుకోవద్దు! నీ పనిని నువ్వు నమ్ముకో.. తప్పకుండా ప్రేక్షకులు నిన్ను కొనియాడతారు. మనం కాలం కంటే కాస్త ముందున్నాం.. త్వరలోనే జనాలు దీని విలువ తెలుసుకుంటారు అని పేర్కొన్నాడు.





మహేష్ బాబు బర్త్ డే స్పెషల్..

# వారణాసి సినిమా నుంచి అప్డేట్

మహేష్ బాబు అభిమానులకు పండుగరోజు. ప్రతి అభిమాని సంబరాలు జరుపుకునే రోజు.. అదే సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు. (ఆగస్టు 9) టాలీవుడ్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా జరుపుకుంటున్నారు. గత వారం రోజుల నుంచే మహేష్ ఫ్యాన్స్ ఆయన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకుంటూ వస్తున్నారు.



నేడు.. మహేష్ బాబు అభిమానులకు పండుగరోజు. ప్రతి అభిమాని సంబరాలు జరుపుకునే రోజు.. అదే సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు. (ఆగస్టు 9) టాలీవుడ్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా జరుపుకుంటున్నారు. గత వారం రోజుల నుంచే మహేష్ ఫ్యాన్స్ ఆయన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకుంటూ వస్తున్నారు. టాలీవుడ్‌లో ప్రిన్స్‌గా, సూపర్ స్టార్ గా పేరు తెచ్చుకున్నాడు మహేష్ . సినిమా ఇండస్ట్రీలో అంచలంచలుగా ఎదుగుతూ తండ్రికి తగ్గ తనయుడిగా పేరుతెచ్చుకున్నాడు. సూపర్ స్టార్ కృష్ణ వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన మహేష్ చైల్డ్ ఆర్టిస్ట్ గా సినిమాలు చేశాడు. 1979లో వచ్చిన 'నీడ' సినిమాలో మహేష్ బాబు అతిథి పాత్రలో కనిపించాడు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కనిపించాడు. 1999లో విడుదలైన 'రాజకుమారుడు' సినిమాతో హీరోగా సినీ రంగ ప్రవేశం చేశాడు. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న మహేష్ ఆతర్వాత వరుస సినిమాలతో దూసుకుపోయారు. రాజకుమారుడు తర్వాత మహేష్ బాబు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించాడు. ఒక్కడు లాంటి ఇండస్ట్రీ హిట్ అందుకున్నాడు. అతడు, పోకిరి, దూకుడు, బిజినెస్ మాన్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, శ్రీమంతుడు, భరత్ అనే నేను ఇలా వరుస హిట్స్ అందుకుంటూ టాలీవుడ్ టాప్ హీరో అయ్యాడు. మహేష్ సినిమాలు రిలీజ్ టైం లోనే కాదు రీ రిలీజ్ ల్లోనూ థియేటర్ల దుమ్ముదులుపుతున్నాయి. సినిమాల్లోనే కాదు రియల్ లైఫ్ లోనూ మహేష్ బాబు సూపర్ స్టారే.. తనదైన శైలి నటనతో నవతరం ప్రేక్షకులను మెప్పిస్తున్న మహేష్ .. ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు, గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు శస్త్ర చికిత్సలు చేయిస్తూ ఎంతో మంది గుండెల్లో దేవుడిగా నిలిచారు. మహేష్ బాబు కేవలం నటుడిగానే కాదు నిర్మాతగా, పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ గా భారీగా సంపాదిస్తున్న మహేష్ బాబు.. తన సంపాదంలో లో 30 శాతం వివిధ సేవలకు ఖర్చు చేస్తారు.మహేష్ బాబు ఏపీ లోని స్వగ్రామమైన బుర్రిపాలెం సహా తెలంగాణ లోని సిద్ధాపురం గ్రామాలను దత్తత తీసుకున్నాడు. ఇక నేడు మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో సెలబ్రెటీలు, ఆయన అభిమానులు, యావత్ ప్రపంచమంతా ఉన్న తెలుగు సినిమా ఆడియన్స్ ఆయనకు విషెస్ తెలుపుతున్నారు.



## అల్లు అర్జున్‌కు డై హార్డ్ ఫ్యాన్‌ను

హీరోయిన్ మమిత బైజు కూడా తాజాగా తన ఫేవరెట్ హీరో గురించి చెప్పి అభిమానులను సర్ప్రైజ్ చేసింది. విశ్వనాథ్ అండ్ సన్స్ ప్రమోషన్స్‌లో భాగంగా.. తాను అల్లు అర్జున్ కు డైహార్డ్ ఫ్యాన్ అని, ఆయన సినిమాలను రిపీట్ మోడ్లో చూస్తూ ఉంటాను అంటూ అల్లు అర్జున్ పై తన ఇష్టాన్ని పంచుకుంది. ముఖ్యంగా బన్నీ స్టైల్ అంటే చాలా ఇష్టమని, ఆయనను ఎప్పుడూ ఫాలో అవుతానని కూడా తెలిపింది.

## ఫ్యాన్‌గర్ల్‌గా వచ్చా

రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా.. క్రియేటివ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ రూపొందించిన ప్రతిష్ఠాత్మక చిత్రం టాక్సిక్: ఎ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్-అప్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ బెంగళూరులో ఎంతో వైభవంగా జరిగింది. ఈ వేడుకలో కథానాయిక రుక్మిణి వసంత్ తెర వెనుక రాత్రింబవళ్లు శ్రమించిన ప్రొడక్షన్ యూనిట్, కెమెరామెన్, సాంకేతిక బృందానికి వేదికపై నుంచి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఒక నటిగా తనకు దక్కిన గుర్తింపునకు కారణం ఈ సాంకేతిక నిపుణుల శ్రమేనని గుర్తించిన తీరు తనలోని సంస్కారాన్ని, ప్రొఫెషనలిజాన్ని చాటిచెప్పింది. ఈ వినయపూర్వక వైఖరే నెటిజన్ల నుండి గొప్ప ప్రశంసలు తెచ్చిపెట్టింది. మాతృభాషాభిమానాన్ని చాటుకుంటూ సొంత ఊరిలో జరిగిన ఈ వేడుకలో రుక్మిణి కన్నడలోనే మాట్లాడి స్థానిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. యష్ స్టార్‌డమ్ ని కీర్తించిన రుక్మిణి.. ఒక ఫ్యాన్‌గర్ల్‌గా వచ్చాను.. సినిమాలో భాగం చేసారు.. అంటూ రుక్మిణి ఎమోషనల్ అయ్యారు.

